క్లుప్తంగా

నూతన నియామకం



నూతన అధ్యక్షుడు ప్రవీణ్‌కు నియామక పత్రం అందజేస్తున్న సంఘం నేతలు

మంచాల: ఆర్యవైశ్య సంఘం మంచాల మండల అధ్యక్షుడిగా రాచమల్ల ప్రవీణ్ గుప్తాను నియమించారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సంఘం ఎన్నికల్లో ఆయనను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకుడిగా సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటేశం గుప్తా, జిల్లా కోశాధికారి భద్రినాథ్ గుప్తా వ్యవహరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు లాలుబహదూర్ శాస్త్రి, వెంకన్న, మల్లేశ్, చంద్రమౌళి, శ్రీను, బాలజీ, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

‘ఐక్యత’ సేవలు అభినందనీయం



వైద్య శిబిరంలో మాట్లాడుతున్న జడ్జి శ్రీదేవి

ఆమనగల్లు: ఐక్యత ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కల్వకుర్తి కోర్టు సీనియర్ జడ్జి శ్రీదేవి అన్నారు. కల్వకుర్తి పట్టణంలో శనివారం ఫౌండేషన్, చెన్నైలోని శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి, సీనియర్ డాక్టర్ దామోదర్‌రెడ్డిలు ప్రారంభించారు. ఈ సందర్భంగా 800 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 35 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. 300 మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పవన్‌కుమార్‌రెడ్డి, బాలరాజు, రమేశ్, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించకపోతే చర్యలు



టిఫిన్ సెంటర్ నిర్వాహకుడికి జరిమానా రసీదు అందజేస్తున్న అధికారులు

తుర్కయంజాల్: హోటళ్లు, బేకరీ, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు స్వచ్ఛతను పాటించకపోతే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.అమరేందర్ రెడ్డి హెచ్చరించారు. శనివారం కమిషనర్ ఆదేశాలతో మున్సిపల్ అధికారులు పురపాలక సంఘం పరిధిలోని పలు దుకాణాలను తనిఖీ చేశారు. అపరిశుభ్రత, కాలం చెల్లిన వంట సామగ్రి, కుళ్లిన ఆహార పదార్థాలను గుర్తించారు. నిషేధిత ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నవారికి జరిమానా విధించారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వినయ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దాతలు

ఆమనగల్లు: ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన మధు అనే మహిళ ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె ఇద్దరు 18 నెలల వయసు ఉన్న కవల పిల్లలు అనాథలుగా మారారు. ప్రస్తుతం తాత సంరక్షణలో ఉన్నారు. ఇందులో ఒకరికి ఆరోగ్య సమస్యలు తలెత్తగా.. ఆస్పత్రిలో చేర్పించారు. వైద్య ఖర్చులు భారం కావడంతో.. శనివారం కొందరు గ్రామస్తులు రూ.52,800లను బంధువులకు అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు, మాజీ ఎంపీపీ అనిత విజయ్, నాయకులు కృష్ణ, తావుర్య, శంకర్, పాండు, రాజ్‌కుమార్, రమేశ్, మణిపాల్, రఘు తదితరులు ఉన్నారు.

రోడ్డుకు మరమ్మతు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం దేవుని పడకల్ గ్రామ సమీపంలోని పంట పొలాలకు, వైకుంఠ ధామానికి వెళ్లే మట్టిరోడ్డు ఇటీవల కురిసిన వర్షానికి బురదగా మారి, గుంతల మయంగా మారింది. రాకపోకలకు అసౌకర్యంగా ఉండటంతో.. విషయాన్ని గ్రామస్తులు.. మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం దృష్టికి తీసుకెళ్లగా.. సొంత నిధులు రూ.30 వేలు వెచ్చించి, మట్టిని పోయించి చదును చేయించారు. కార్యక్రమంలో నాయకులు భిక్షపతి, శంకర్, కృష్ణ, వేణు, శ్రీను, కార్తీక్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చేస్తారా.. లేదా?

కొనుగోలుదారుల్లో లాటరీ గుబులు

- ఫ్యూచర్ ఆశతో భారీగా ప్లాట్ల కొనుగోలు
- అప్పట్లో 121 గజాలకు రూ.3.50 లక్షలు
- ప్రస్తుతం రూ.9 లక్షలకు డిమాండ్
- రైతులు, మధ్యవర్తుల స్పందనపై ఆందోళన



రైతులకు ఇచ్చిన ప్లాట్ల వెంచర్‌కు వేసిన రోడ్డు

యాచారం: ఫార్మా ప్లాట్ల కొనుగోలుదారుల్లో లాటరీ గుబుల్ పట్టుకుంది. లాటరీల్లో ప్లాట్ల నంబర్లు తేలి, రిజిస్ట్రేషన్లు జరిగితే.. ఆ ప్లాట్లను రైతులు తమ పేరిట రిజిస్ట్రేషన్లు చేస్తారో, లేదోనని కొనుగోలు దారులు ఆందోళన చెందుతున్నారు. ఫార్మాసిటీకి గత ప్రభుత్వం.. యాచారం మండల పరిధి నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 7,640 ఎకరాల అసైన్డ్, పట్టా భూములను సేకరించింది. అందులో పరిహారం పొందిన 3,900 మంది రైతులకు.. ఎకరాకు 121 గజాల ప్లాట్ల సర్టిఫికెట్లను పంపిణీ చేసింది. మండలానికి 15 కిలో మీటర్ల దూరంలో ఉన్న కందుకూర్ మండల పరిధి మీరాఖాన్‌పేట, పంజాగూడ గ్రామాల సరిహద్దులో టీజీఐఐసీ మెగా వెంచర్‌ను ఏర్పాటు చేసింది. ఫార్మాలో భూములు కోల్పోయి సర్టిఫికెట్లు పొందిన రైతులు.. తమ గ్రామాలను వదిలి మీర్‌ఖాన్‌పేటకు ఎందుకు వెళ్తామని పేర్కొంటూ.. ఆ ప్లాట్ల సర్టిఫికెట్ల విక్రయాలకు సిద్ధపడ్డారు.

పెరిగిన ప్లాట్ల డిమాండ్

మీర్‌ఖాన్‌పేటలో టీజీఐఐసీ మెగా వెంచర్ ఏర్పాటు చేయక ముందు మండల పరిధి నక్కర్తమేడిపల్లి, నానక్‌నగర్, తాడిపర్తి, కుర్మిద్ద రైతులు 121 గజాల ప్లాటును కేవలం రూ.3.50 లక్షలకు అమ్ముకున్నారు. తొలుత వెంచర్‌లో అభివృద్ధి పనులు జరగలేదు. ఆ తర్వాత అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఫార్మాసిటీకి సేకరించిన భూముల్లో ఫ్యూచర్‌సిటీ నిర్మిస్తామని ప్రకటించింది. అందులో భాగంగా పలు సంస్థల నిర్మాణానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఆ తర్వాత వెంచర్‌లో అభివృద్ధి పనులు చకచకా కొనసాగాయి. దీంతో రైతులు విక్రయించిన ప్లాట్ల విలువ రూ.9 లక్షల వరకు డిమాండ్ పెరిగింది. కొనుగోలు దారులు.. రైతుల నుంచి ప్లాట్లను కొనే సమయంలో సుమారు 60 శాతం వరకు డబ్బులు చెల్లించారు. రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత మొత్తం డబ్బులు ఇస్తామని ఒప్పందం చేసుకున్నారు.

కొనుగోలుదారుల్లో భయాందోళన

ఫార్మాకు భూములు అప్పగించిన గ్రామాల్లోని రైతులు 3,900 మందికి.. ఫ్మార్మా ప్లాట్ల సర్టిఫికెట్లు అందజేశారు. అందులో రెండు వేల మంది వరకు తమ ప్లాట్లను అమ్ముకున్నారు. ఆ ప్లాట్లకు ఫ్యూచర్ ఉంటుందనే భరోసాతో ఎన్‌ఆర్‌ఐలు, పారిశ్రామిక వేత్తలు, ఉద్యోగులు, రాజకీయ నాయకులు, ప్రైవేటు విద్యాసంస్థల ప్రతినిధులు ఇలా చాలా మంది.. అధికంగా ప్లాట్లను కొనుగోలు చేశారు. వాటి సర్టిఫికెట్ల కొనుగోలు సమయంలో నోటరీ, అగ్రిమెంట్, కుటుంబ సభ్యుల సంతకాలు, రైతుల పేరిట చెక్కుల పాస్ చేయడం వంటి నిబంధనలు పాటించినప్పటికీ.. కొనుగోలుదారులకు మాత్రం ఏదో తెలియని భయం వెంటాడుతోంది. లాటరీ ద్వారా ప్లాట్ల నంబర్లు తేలి, రిజిస్ట్రేషన్లు చేసిన తర్వాత రైతులు వెంటనే రిజిస్ట్రేషన్లు చేస్తారా? లేదా మళ్లీ ఏమైనా డబ్బులు డిమాండ్ చేస్తారా.. లేక ప్లాట్లు రిజిస్ట్రేషన్లు చేసేది లేదంటారా.. అని కొనుగోలుదారుల్లో ఆందోళన మొదలైంది. రైతుల నుంచి ప్లాట్ల విక్రయాలు జరిపి, కమీషన్ పొందిన మధ్యవర్తులు సహకరిస్తారా.. లేదా అని భయాందోళన చెందుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఊరట



బాధితులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముఖ్యమంత్రి సహాయనిధి పథకం.. ఆపదలో ఉన్న పేదలకు ఊరటనిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణానికి చెందిన అయూబ్ వైద్య ఖర్చుల కోసం సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోగా.. రూ.2 లక్షల చెక్కు మంజూరు అయింది. ఈ మేరకు శనివారం నగరంలోని తన నివాసంలో బాధిత కుటుంబీకులకు ఎమ్మెల్యే చెక్కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సహాయనిధి ద్వారా.. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ రమేశ్‌గౌడ్, సింగిల్‌విండో డైరెక్టర్ జగన్‌గౌడ్, నాయకులు రామకృష్ణ, మెకానిక్ బాబా, విజయ్‌రాథోడ్ తదితరులు ఉన్నారు.

పోగొట్టుకున్న ఫోన్ల అందజేత



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న సీఐ గంగాధర్, ఎస్‌ఐలు

కడ్తాల్: ప్రైవేట్ టీచర్ ఆదిత్య, హైదరాబాద్‌కు చెందిన నాగేందర్ ఇటీవల తమ ఫోన్లను మండల కేంద్రంలో పోగొట్టుకున్నారు. అదే రోజు వారు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. నూతన సాంకేతిక పరిజ్ఞానం(సీఈఐఆర్) అప్లికేషన్ ద్వారా సెల్‌ఫోన్ల ఆచూకీ కనుగొన్నారు. అనంతరం శనివారం ఠాణాలో ఇరువురు బాధితులకు సీఐ గంగాధర్ మొబైల్స్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకున్నా, చోరీకి గురైనా.. వాటి వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా.. ఫోన్లను తిరిగి పొందే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు వరప్రసాద్, చంద్రశేఖర్, కానిస్టేబుల్ రాంకోటి ఉన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

అభినందించిన ఉపాధ్యాయులు, గ్రామస్తులు

మాడ్గుల: ఇర్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన అశ్విని, సౌమ్యశ్రీ, స్పందన, రమ్యశ్రీ, జునేద్, స్నోహిత్, ప్రోహిత్, వైష్ణవిలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శనివారం ఉపాధ్యాయులు, గ్రామస్తులు విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు పర్వతాలు మాట్లాడుతూ.. ఇంజినీరింగ్ విద్యనందించే బాసర ట్రిపుల్ ఐటీకి పోటీ తీవ్రత ఉన్నప్పటికీ.. తమ విద్యార్థులు ప్రతిభచాటి, ఎంపిక కావడం సంతోషంగా ఉందని, ఇందుకు గర్వపడుతున్నామని పేర్కొన్నారు.

మజీద్‌పూర్ నుంచి కీర్తన



మండలి కీర్తన

అబ్దుల్లాపూర్‌మెట్: మండల పరిధి మజీద్‌పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసిన మండలి కీర్తన బాసర ట్రిపుల్ ఐటీకి ఎంపిక అయిందని ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డి శనివారం తెలిపారు. ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు పోటీ ఉన్నప్పటికీ.. తమ విద్యార్థిని ప్రతిభతో నిలబడిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

రోడ్డు విస్తరణ పనులు షురూ

- అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు
- త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డి ఆదేశం



నాదర్‌గుల్‌లో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగిస్తున్న సిబ్బంది

బడంగ్‌పేట్: గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్‌లో రోడ్డు విస్తరణలో భాగంగా అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాల తొలగింపు పనులను ఆ శాఖ అధికారులు, సిబ్బంది శనివారం ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి విద్యాశాఖ మంత్రిగా ఉన్న సమయంలో గాంధీనగర్ నుంచి నాదర్‌గుల్ వరకు, నాదర్‌గుల్ నుంచి కుర్మల్‌గూడ వరకు రోడ్ల విస్తరణ కోసం నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. ఈ పనులు చేపట్టేందుకు రహదారులకు ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలతో పాటు అడ్డుగా ఉన్న చెట్ల కారణంగా పనులు సాగలేదని తెలిపారు. మూడు రోజుల క్రితం బడంగ్‌పేట మునిసిపల్ కార్పొరేషన్ అధికారులతో ఎమ్మెల్యే సమీక్షా సమావేశం నిర్వహించి తక్షణమే రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారన్నారు. ఇందులో భాగంగా ముందు విద్యుత్ లైన్లను తొలగిస్తున్నారని స్పష్టంచేశారు. పనులు ప్రారంభించి, వేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్న ఎమ్మెల్యే సబితారెడ్డికి బీఆర్ఎస్ నాయకులు, స్థానికులు కృతజ్ఞతలు చెబుతున్నారు.

నేడు ఉచితంగా రేబిస్ టీకా

ఇబ్రహీంపట్నం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జూనోసిస్ డే ను పురస్కరించుకొని ఆదివారం ఇబ్రహీంపట్నం పశువైద్యశాలలో కుక్కలకు, పెంపుడు పిల్లులకు ఉచితంగా రేబిస్ టీకా వేయనున్నామని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ వసంతకుమారి, పశువైద్యాధికారులు ఆనంద్‌రెడ్డి, సరితలు తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు టీకా వేస్తామని, జంతు ప్రేమికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

డీఈఈగా ఇంద్రసేనారెడ్డి బాధ్యతల స్వీకరణ



ఇంద్రసేనారెడ్డిని సన్మానించిన పంచాయతీ అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: హయత్‌నగర్ సబ్ డివిజన్ పంచాయతీ రాజ్ డీఈఈగా గుర్రం ఇంద్రసేనారెడ్డి శనివారం బాధ్యతలు స్వీకరించారు. 1991లో ఇంజినీరింగ్ విభాగంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా విధుల్లో చేరిన ఆయన.. 2005లో ఏఈగా పదోన్నతి పొందారు. నాటి నుంచి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లో ఏఈఈగా విధులు నిర్వహించారు. ఇటీవల డీఈఈగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా ఆయనకు అధికారులు, సిబ్బంది, నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థుల ఆసక్తిని ప్రోత్సహించాలి



ఫ్రెషర్స్ డే వేడుకలో చిన్నారుల నృత్య ప్రదర్శన

మీర్‌పేట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను గుర్తించి ఇష్టం ఉన్న రంగాల్లో ప్రోత్సహించాలని నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమమకొండ విఠల్‌రెడ్డి తల్లిదండ్రులకు సూచించారు. శనివారం మీర్‌పేట నాగార్జున మాంటిస్సోరి, ఐఐటీ ఒలింపియాడ్ స్కూల్ ఫ్రెషర్స్‌డే వేడుక సందడిగా జరిగింది. ఈ సందర్భంగా విఠల్‌రెడ్డి మాట్లాడుతూ కొత్తగా చేరిన విద్యార్థులు ఇతర విద్యార్థులతో కలిసిపోయి కొత్త వాతావరణానికి అలవాటు పడేందుకు ఈ వేడుక ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.విజయ్‌కుమార్, ఇంచార్జిలు దుర్గ, రాధిక, సంధ్య ప్రశాంతి పాల్గొన్నారు.

సమ్మె కరపత్రాల ఆవిష్కరణ

మీర్‌పేట: సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా విజయవంతం చేయాలని ఆ సంఘం బాలాపూర్ మండల అధ్యక్షుడు దాసరి బాబు పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన కరపత్రాలను శనివారం మీర్‌పేట్‌లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. కార్మికులకు వ్యతిరేకంగా, పెట్టుబడిదారులకు ప్రయోజనంగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులు లక్ష్మి, శ్యామల ఉన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి



కమిషనర్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

ఇబ్రహీంపట్నం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ నాయకులు కోరారు. ఈ మేరకు సమ్మె నోటీసును మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మున్సిపల్ కన్వీనర్ ఎల్లేష్ మాట్లాడుతూ.. ప్రతి కార్మికుడికి రూ.26 వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని, కార్మికులు మరణిస్తే మట్టి ఖర్చులకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. వారాంతపు సెలవులు మంజూరు చేయాలని, మెప్మా ఆర్పీలకు ఉద్యోగ భద్రత కల్పించి తదితర సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమలో ఆ సంఘం నాయకులు చందునాయక్, లక్ష్మయ్య, యాదయ్య, భాగ్య, సప్న, అండాలు, జంగమ్మ, శివరాజమ్మ, శమంత, బుగ్గమ్మ, కలమ్మ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి చట్టాన్ని రక్షించుకుందాం



కూలీలతో మాట్లాడుతున్న కార్మిక సంఘం నాయకుడు

యాచారం: ఉపాధిహామీ చట్టం రక్షణ కోసం ఈ నెల 9న చేపట్టనున్న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పి.అంజయ్య పిలుపునిచ్చారు. మండల పరిధి మొగుళ్లవంపు, యాచారం గ్రామాల్లో శనివారం ఆయన ఉపాధి కూలీలతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఏటా నిధులు తగ్గిస్తూ ఉపాధిహామీని నిర్వీర్యం చేయాలని చూస్తోందని ఆరోపించారు. అందులో భాగంగా కఠిన నిబంధనలు అమలు చేస్తూ.. సకాలంలో వేతనాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఉపాధి చట్టాన్ని పరక్షించుకోవడం కోసం కూలీలు కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు పుష్ప తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిన్నర కాలంలో ఎనలేని అభివృద్ధి

- మున్సిపాలిటీలకు భారీగా నిధులు
- త్వరలో ఇబ్రహీంపట్నంలో వంద పడకల ఆస్పత్రి
- ఎమ్మెల్యేను విమర్శించే నైతిక హక్కు మంచిరెడ్డికి లేదు
- మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి తదితరులు

ఇబ్రహీంపట్నం రూరల్: బీఆర్ఎస్ హయాంలో చేయని అభివృద్ధి.. కేవలం ఏడాదిన్నర కాలంలో ఎనలేని పనులను ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చేసి చూపించారని ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ గురునాథ్‌రెడ్డి అన్నారు. ఆయనను విమర్శించే నైతిక హక్కు మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డికి లేదన్నారు. శనివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధి బొంగ్లూర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మహిపాల్, పీసీసీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంకాల దాసుతో కలిసి ఆయన మాట్లాడారు. త్వరలోనే ఇబ్రహీంపట్నంలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం కాబోతుందని తెలిపారు. అలాగే నియోజకవర్గంలోని నాలుగు మున్సిపాలిటీలకు హెచ్ఎండీఏ నుంచి రూ.100 కోట్ల చొప్పున నిధులు రాబోతున్నాయని చెప్పారు. లింగంపల్లి డబుల్ బెడ్రూం ఇళ్ల విషయంలో బీఆర్ఎస్ నాయకులు రాజకీయం మానుకోవాలని హితవు పలికారు. వాటిల్లో విద్యుత్, తాగునీరు, భూగర్భ డ్రైనేజీ తదితర మౌలిక వసతులను రెండు నెలల్లో ఏర్పాటు చేసి, వారికి ఇచ్చే బాధ్యత కాంగ్రెస్‌దేనని స్పష్టంచేశారు. ఈ నెల 8 నుంచి రేషన్ కార్డు, పింఛన్లకు దరఖాస్తు చేసుకుంటే, 24 గంటల్లో అమలు అయ్యే విధంగా ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఆదిబట్ల మున్సిపాలిటీ అధ్యక్షుడు గౌని బాల్‌రాజ్‌గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కరుణాకర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పాండురంగారెడ్డి, యాచారం మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అయిలయ్య, పార్టీ పట్నం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రామారావు, యాదగిరిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు ‘చేయూత’నివ్వండి



తహసీల్దార్ సునితారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎన్‌పీఆర్డీ నేతలు

ఇబ్రహీంపట్నం: పెండింగ్ పింఛన్లను తక్షణమే మంజూరు చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి జెర్కొని రాజు డిమాండ్ చేశారు. వికలాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శనివారం తహసీల్దార్ సునీతరెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 43.02 లక్షల మంది వికలాంగులు ఉండగా.. అందులో 24.85 లక్షల మంది చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కానీ ప్రభుత్వం ఇంత వరకు మంజూరు చేయలేదని విమర్శించారు. మరొకరిపై ఆధారపడిన వారికి చేయూత నివ్వాల్సిన ప్రభుత్వం.. వారి పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. పంచాయతీరాజ్, మున్సిపల్ చట్టాలను సవరించి, స్థానిక సంస్థల్లో ప్రాతినిధ్యం కల్పించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నేతలు నిర్మల, తిరుమల్‌రెడ్డి, సుభాష్, సతీష్‌గౌడ్, అస్లమ్, బాలమణి, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై నిరంతర పోరాటం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న యాదయ్య తదితరులు

మంచాల: ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటం చేసేది సీపీఎం పార్టేనని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పగుడాల యాదయ్య అన్నారు. శనివారం మంచాలలోని పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. స్థానిక ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో పార్టీ సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పిట్టల రవి, మండల కార్యదర్శి రావుల జంగయ్య, మండల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, బుగ్గరాములు, శ్యాంసుందర్, గోపాల్, లెనిన్, జగన్, కృష్ణ, జంగయ్య, యాదయ్య, సుధాకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సంచార జాతులకు సర్టిఫికెట్లు ఇవ్వాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

మీర్‌పేట: మండల పరిధిలోని సంచార జాతుల వారికి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఐ నాయకులు శనివారం బాలాపూర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ.. బతుకుదెరువు, ఇతర చిరు వ్యాపారాల నిమిత్తం సంచార జాతుల వారు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి ఈ ప్రాంతంలో నివాసముంటున్నారని తెలిపారు. ఇలాంటి వారు మండల పరిధిలో 600 కుటుంబాలకు పైగా ఉన్నారన్నారు. స్థానికంగా ఉండే సంచార జాతులతో కలిపి వీరికి కూడా కుల ధ్రువీకరణ పత్రాలు ఇచ్చేలా చొరవ తీసుకోవాలని తహసీల్దార్‌కు విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ఇందుకు ఆయన సానుకూలంగా స్పందించారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల మహిళా కార్యదర్శి యాదమ్మ, సహాయ కార్యదర్శి రెడ్యానాయక్, గిరిజన సమైక్య మండల కార్యదర్శి శత్రునాయక్, రమావత్ పాండునాయక్, ఆర్తి, సోని, కమల, దినేష్, శ్రీకర్, పవన్ ఉన్నారు.